

AKSHARA TODAY
అక్షర నేటిడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com

కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం..





చేయని ఖర్చుకు ముందస్తు బిల్లులా

బీపీటీ బియ్యం కిలో రూ.66కే విక్రయించాలి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: జిల్లాలో బీపీటీ బియ్యాన్ని ప్రభుత్వం నిర్దేశించిన ధర ప్రకారం కిలో రూ.66కే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా మజ్లిస్‌ఎఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఎంఐఎం) నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా పాలనాధికారి ఇలా త్రిపాఠి కి వినతిపత్రం అందజేశారు. మిల్లర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు బీపీటీ బియ్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తూ సామాన్య ప్రజలపై ఆర్థిక భారం మోపుతున్నారని ఎంఐఎం నాయకులు పేర్కొన్నారు.

రైస్ మిల్లర్లలో ఆందోళన పెరిగిపోతోంది. నిజామాబాద్ జిల్లాలో సీఐడీ ఎంట్రీతో కామారెడ్డి జిల్లా రైస్ మిల్లర్ల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. సీఎంఆర్ బకాయిలు పేరుకుపోవడం, ప్రభుత్వానికి తిరిగి చెల్లించేందుకు మిల్లర్ల వద్ద స్టాక్ లేకపోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఎప్పుడు, ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనన్న భయం మిల్లర్లలో నెలకొంది.

– అక్షరటుడే, కామారెడ్డి



అజ్ఞాతంలోకి

రైస్‌మిల్లర్లు..

■ నిజామాబాద్ ఘటనలతో ఆందోళనలో పలువురు ■ ఇప్పటికే కొందరు మిల్లర్లపై కేసులు నమోదు

కామారెడ్డి జిల్లాలో సీఎంఆర్ బకాయిలు భారీగా పేరుకుపోయాయి. దీంతో పలు రైస్ మిల్లులు డిఫాల్టర్ జాబితాలో పడిపోయాయి. ఫలితంగా ప్రస్తుతం రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించలేని పరిస్థితి నెలకొంది. ఇటు బకాయిలు చెల్లించలేక, అటు కొత్తగా ధాన్యం తీసుకోలేక మిల్లర్లు సతమతమవుతున్నారు.

సీఐడీ ఎంట్రీతో ఆందోళన

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 60కి పైగా రైస్ మిల్లర్లు సీఎంఆర్ బకాయిలు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం సీరియస్ గా చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటికే విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు కొనసాగాయి. బకాయి పడ్డ రైస్ మిల్లర్లపై కేసులు నమోదు చేసి, పలువురిని అరెస్ట్ కూడా చేసింది. నిజామాబాద్ జిల్లాలో డీసీఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డిని సస్పెండ్ చేయడం, ఏకంగా సీఐడీ రంగంలోకి దిగడంతో మిల్లర్లలో గుబులు మరింత పెరిగింది.

కేసులు నమోదుతో భయాందోళన..

కామారెడ్డి జిల్లాలో గతంలో రైస్ మిల్లర్లపై విజిలెన్స్ అధికారులు కేసులు నమోదు చేయడం చర్చనీయాంశంగా మారింది. ఏకకాలంలో విజిలెన్స్ దాడులు నిర్వహించడంతో మిల్లర్లు ఉక్కిరిబిక్కిరయ్యారు. పలు దఫాలుగా దాడులు జరగడం, కేసులు నమోదు చేసి రిమాండుకు తరలించడంతో జిల్లాలో ఉత్కంఠ నెలకొంది.

ఫోన్లు స్విచ్ఛాఫ్..

నిజామాబాద్ జిల్లాలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల తర్వాత అంతా సైలెంట్ అవుతుందని అందరూ భావించారు. కానీ ఊహించని విధంగా సీఐడీ సడెన్ ఎంట్రీతో అంచనాలు తారుమారయ్యాయి. సీఐడీ దాడులతో ఉమ్మడి జిల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నిజామాబాద్ లో మిల్లర్లను అరెస్ట్ చేశారన్న వార్త కామారెడ్డి జిల్లాలో దావానంలా వ్యాపించింది. దీంతో సీఐడీ అధికారులు కామారెడ్డికి కూడా వస్తారని, ఎక్కడ అరెస్ట్ అవుతామోనన్న భయంతో పలువురు మిల్లర్లు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకుని అండర్ గ్రౌండ్ లో ఉంటూ ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.

ధాన్యం నిరాకరణ

ప్రస్తుతం వానాకాలం సీజన్‌కు సంబంధించిన ధాన్యం కోతలు మొదలయ్యాయి. జిల్లాలో కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభమయ్యాయి. సీఎంఆర్ బకాయిల నేపథ్యంలో ఈసారి రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపులు చేయడానికి ప్రభుత్వం నిరాకరించినట్లు తెలుస్తోంది. తాల్లో గోదాములను అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని ఎప్పటికప్పుడు గోదాముల్లో భద్రపరిచేలా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఈ నిర్ణయం రైస్ మిల్లర్లకు పెద్ద షాక్ అని చెప్పవచ్చు. ప్రస్తుతం ధాన్యం కేటాయింపులు లేక మిల్లుల్లో ధాన్యం నిల్వ లేకపోవడంతో మిల్లర్లు ఆందోళనలో ఉన్నారు. పలువురు ఆస్తులు అమ్మి బకాయిలు చెల్లించేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ క్రమంలో భవిష్యత్తులో రైస్ మిల్లర్ల పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని చర్చ జరుగుతోంది.



క్రాకర్స్ విక్రయదారులు నిబంధనలు పాటించాలి : సీపీ సాయిచైతన్య

అక్షరటుడే, నిజామాబాద్ సిటీ : క్రాకర్స్ విక్రయదారులు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీపీ సాయిచైతన్య అన్నారు. జిల్లా పాలిటెక్నిక్ క్రాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, హోల్‌సేల్ షాపుల యాజమాన్యాలతో సీపీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. బాణసంచా విక్రయాలు నిర్వహించే ప్రతి షాపు యాజమాన్యం ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. సంబంధిత శాఖల నుంచి అవసరమైన లైసెన్సులు పొందిన తర్వాతే విక్రయాలు చేపట్టాలని స్పష్టం చేశారు. షాపుల వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా తగిన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతకు సంబంధించిన అంశాల్లో ఎక్కడా అలసత్వం ప్రదర్శించరాదని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా విక్రయాలు నిర్వహించినా.. భద్రతా ప్రమాణాలు పాటించకపోయినా సంబంధిత షాపు యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏసీపీ ప్రకాష్, టౌన్ సీఐ సత్యనారాయణ,రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, పన్ టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్, ఎస్సైలు యాదగిరి గౌడ్, హరిబాబు, సాయన్న, సునీల్, క్రాకర్స్ అసోసియేషన్ ప్రతినధులు సంతోష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అక్షరటుడే,నిజామాబాద్ సిటీ: నగరంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. 33/11 కేవీ రైతు బజార్ ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ కోసం టవర్స్ బిగించే క్రమంలో 33/11 కేవీ వినాయక్ నగర్ సబ్ స్టేషన్ పరిధిలో సరఫరాను అధికారులు నిలిపివేయనున్నారు. ఈ మేరకు టౌన్-3 ఏడీఈ వినోద్ వివరాలు వెల్లడించారు. మంగళవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు 11కేవీ గాయత్రి నగర్ ఫీడర్‌లో పరిధిలోన వినాయక్ నగర్ పాత పోలీస్ స్టేషన్ ఏరియా, రామ్‌రాజ్ కాటన్, ఓల్డ్ హౌసింగ్ బోర్డ్, శంకర్ ప్లైవుడ్ పరకు కరెంట్ ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాబార్డు నిధులతో గాంధారి పాఠశాలలకు మహర్దశ

అక్షరటుడే, గాంధారి: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ చొరవతో గాంధారి మండలంలోని 13 ప్రభుత్వ పాఠశాలలకు నాబార్డు నిధులు రూ.4.20 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులను పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం కేటాయించారు. పీఎంఎస్‌హెచ్‌ఆర్ఐ జెడ్‌పీహెచ్ఎస్ గాంధారిలో 12 గదులకు రూ. 1.62 కోట్లు, 5 గదులకు రూ. 67.75 లక్షలు మంజూరయ్యాయి. ఎంపీపీఎస్ రాంపూర్ గడ్డ స్కూల్‌కు 3 గదులకు రూ. 40.65 లక్షలు, ఎంపీపీఎస్ మేడిపల్లిలో 2 గదులకు రూ. 27.10 లక్షలు వచ్చాయి. మిగితా 9 పాఠశాలలు (ఒక్కో పాఠశాలలో ఒక్కో గదికి రూ. 13.55 లక్షల చొప్పున) సోమారం తండా, బుర్గుల్, గౌరారం కలాన్, వెంకటాపూర్, గండివేట్, గాంధారి ఎస్సీ వాడ, మాధవపల్లి, జువ్వాడి, వండ్రికల్ మంజూరయ్యాయి. సరిపడా తరగతి గదులతో పేద విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు. నాణ్యమైన విద్యను గ్రామీణ విద్యార్థులకు చేరువ చేసేందుకు ఎమ్మెల్యే చేస్తున్న కృషి పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

టేక్రియాల్ చెరువులో నిమజ్జన వ్యర్థాలను తొలగించాలి



అక్షరటుడే, కామారెడ్డి : టేక్రియాల్ చెరువులో నిమజ్జన వ్యర్థాలను తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి అధికారులను ఆదేశించారు. సోమవారం టేక్రియాల్ చెరువును ఆమె పరిశీలించారు. చెరువులో నిమజ్జనం తర్వాత పేరుకుపోయిన పూలు, విగ్రహాల వ్యర్థాలతో నీటి కాలుష్యం ఏర్పడుతోందని గుర్తించారు. వెంటనే చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, నీటి కాలుష్యాన్ని నివారించడానికి తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ నిమజ్జన వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించి, చెరువు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు. కౌన్సిలర్ లలిత, డీఈ హన్మంత్ రావు, ఏఈ వేణు ప్రసాద్, శానిటేషన్ ఇంచార్జ్ ప్రశాంత్ పాల్గొన్నారు.

అధిక ధరకు బియ్యం అమ్మితే కఠిన చర్యలు: కలెక్టర్ ఇలా త్రిపాఠి



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: అధిక ధరలకు బియ్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టం చేశారు. గజానన్ రైస్‌మిల్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో గాంధీ గంజ్ కమాన్ గోశాల రోడ్ వద్ద రైస్ అవుట్‌లెట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. బీపీటీ, హెచ్ఎంటీ తదితర రకాల బియ్యంను ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే మరికొంత తక్కువ ధరకే విక్రయాలు జరిపేలా ముందుకొచ్చిన గజానన్ ఇండస్ట్రీస్ యాజమాన్యాన్ని కలెక్టర్ అభినందించారు. ఎల్‌నినో ప్రభావం కారణంగా బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులతో ఆకస్మిక తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. తనిఖీల కోసం వచ్చే బృందాలకు వ్యాపారులు, ట్రేడర్లు సహకరించాలని సూచించారు. కాగా 26 కిలోల బరువుతో కూడిన ప్రీమియం క్వాలిటీ బీపీటీ స్టీమ్ రైస్ బ్యాగ్‌ను రూ.1,510 లకు, హెచ్ఎంటీ బియ్యం రూ.2,030 చొప్పున విక్రయాలు జరుపుతామని గజానన్ ఇండస్ట్రీస్ నిర్వాహకులు హితెన్ భిమాని తెలిపారు. కమల్ కిషోర్, ప్రియాన్ భిమాని, రవీష్ తదితరులు పాల్గొన్నారు.

దాహార్తి సమస్య రాకుండా ముందస్తు చర్యలు

జిల్లాలో దాహార్తి సమస్య తలెత్తకుండా ముందస్తుగానే పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం పలు కీలక అంశాలపై కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. రానున్న వేసవి సీజన్లో ప్రతి నివాస ప్రాంతానికి ప్రజల అవసరాలకు సరిపడేలా రక్షిత మంచినీరు సరఫరా అయ్యే విధంగా అధికారులు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలన్నారు.

ఎల్లారెడ్డి ప్రజావాణికి ఏడు ఫిర్యాదులు



అక్షరటుడే, ఎల్లారెడ్డి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం ఏడు ఫిర్యాదుల దరఖాస్తులు అందాయి. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాల్సిందిగా ఆర్డీవో ప్రభాకర్, ఎంపీడీవో తాహెర బేగం సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయంలో నాలుగు దరఖాస్తుల్లో మున్సిపల్ శాఖకు సంబంధించినవి రెండు, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించినవి రెండు ఉన్నాయి. ఈ కార్యక్రమానికి మొత్తం 14 మంది అధికారులు హాజరయ్యారు. ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో నిర్వహించిన డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మరో మూడు ఫిర్యాదుల దరఖాస్తులు స్వీకరించారు. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించి ఒకటి, విద్యాశాఖకు సంబంధించి ఒకటి, పంచాయతీరాజ్ శాఖకు సంబంధించి ఒక దరఖాస్తు ఉంది.

పోలీస్ ప్రజావాణిలో ఫిర్యాదుల స్వీకరణ

అక్షరటుడే నిజామాబాద్ క్రైం: నగరంలోని పోలీకమిషనర్ కార్యాలయంలో సోమవారం పోలీస్‌ప్రజావాణి నిర్వహించారు. సీపీ సాయిచైతన్య బాధితుల నుంచి 37 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ప్రజాసమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు.





సాంపల్లి సామ్ చెరువు కబ్జాపై ఫిర్యాదు

అక్షరటుడే, డిచ్‌పల్లి: మండలంలోని సాంపల్లి సామ్ చెరువు కబ్జాకు గురవుతోందని, సర్వే చేపట్టి శిఖం భూమిని కాపాడాలని గ్రామస్తులు కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణిలో అధికారులకు సాంపల్లి, సాంపల్లి తండా, మెలయ్య తండా, గుడి తండావాసులు ఫిర్యాదు చేశారు. చెరువును దౌర్జన్యంగా కబ్జా చేయడంతో ఆయకట్టు రైతులకు నీరు అందరి పరిస్థితి ఏర్పడుతోందన్నారు. మెంట్రాజ్‌పల్లి శివారు సాంపల్లిలో 334 సర్వే నెంబరులో 42.0900 ఎకరాల్లో చెరువు విస్తీర్ణం కాగా, ఇందులో చాలా మేర కబ్జాకు గురవుతోందన్నారు. కొందరు శిఖం భూమిని ఆక్రమించి పంటలు సాగు చేస్తున్నాని, గతంలో మిషన్ కాకతీయ పథకం క్రింద ఈ చెరువును పునరుద్ధరణ పనులు చేపట్టినప్పటికీ చుట్టూ కందకం తీయకపోవడంతో శిఖం భూమి పెరిగిపోతుందని పేర్కొన్నారు. చెరువు చుట్టు ఉన్న రైతుల్లో కొందరు తమ పలుకుబడితో శిఖం భూమిని యదేచ్ఛగా ఆక్రమించుకుంటున్నా గ్రామంలో ప్రశ్నించేందుకు భయపడుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సాంపల్లి సామ్ చెరువును రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో ఉమ్మడి సర్వే చేయించి ఆక్రమణకు గురైన శిఖం భూమిని వెలికితీసి చెరువు చుట్టూ కంచె వేయించాలని కోరారు.

ఆలూర్‌లో జోనల్ స్థాయి వాలీబాల్ సెలక్షన్స్



అక్షరటుడే, ఆర్మూర్ : ఆలూరు ఉన్నత పాఠశాలలో నందిపేట్ జోనల్ స్థాయి వాలీబాల్ ఎంపికలను నిర్వహించారు. పీడీ రాజేశ్ ఆధ్వర్యంలో నందిపేట్ జోన్ పరిధిలోని ఆలూరు, నందిపేట్, డొంకేశ్వర్ మండలాలకు చెందిన క్రీడాకారులకు అండర్ 14, అండర్ 17 విభాగాల్లో బాలబాలికలకు వాలీబాల్ ఎంపిక పోటీలు జరిగాయి. మండల విద్యాశాఖ అధికారి నరేందర్ మాట్లాడుతూ.. సెలక్షన్స్‌లో ఎంపికైన క్రీడాకారులు మరింత పట్టుదలతో సాధన చేసి, మంగళవారం నందిపేట్‌లోని గీత కాన్వెంట్ పాఠశాలలో నిర్వహించనున్న జిల్లాస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. నందిపేట్ జోన్ సీనియర్ ఉపాధ్యాయులు నాంచారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఎలాంటి భేదాభిప్రాయాలకు తావులేకుండా పారదర్శకంగా సెలక్షన్స్ నిర్వహించాలని సూచించారు. పీడీలు రాజేశ్వర్, శ్రీనివాస్, కవితతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పీఈటీలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు జట్లు ఎంపిక



అక్షరటుడే, భీమ్‌గల్: పట్టణంలోని కృషి హైస్కూల్‌లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్ 17 బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. భీమ్‌గల్ అర్బన్ పరిధిలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన 12 మంది బాలురు, 12 మంది బాలికలను తుది జట్లకు ఎంపిక చేశారు. ఈ జట్లు మంగళవారం నందిపేటలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటాయని భీమ్‌గల్ అర్బన్ ఇన్‌ఛార్జి కార్యదర్శి సదమస్తుల రమణ తెలిపారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖాధికారి స్వామి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడా కోటాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిత్యం వ్యాయామం చేస్తూ క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కృషి హైస్కూల్ కరస్పాండెంట్ అజిత్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు నరేష్, లింగం, అభిషేక్, రాకేష్, ప్రశాంత్, సుమన్, గంగాధర్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల సాహిత్యంలో అధ్యాపకుడికి డాక్టరేట్



అక్షరటుడే, ఎల్లారెడ్డి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ అధ్యాపకుడు బాదవత్ సంతోష్ ఆంగ్ల సాహిత్యంలో డాక్టరేట్ పట్టా సాధించాడు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ఆయనను అభినందించారు. రాజస్థాన్ రాష్ట్రంలోని ఝున్‌ఝునులో ఉన్న ఎస్‌జేజేటీయూ విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ అన్ష శర్మ మార్గదర్శకత్వంలో 'భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో సాహిత్యం యొక్క ప్రభావం' అనే అంశంపై పరిశోధన నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సంతోష్ పీహెచ్‌డీ పట్టా సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్, ఐక్యేసీ సమన్వయకర్త శంకరయ్య, టీఎస్కేసీ సమన్వయకర్త జంగం శివకుమార్, అధ్యాపకులు అరుణ్ కుమార్, గంగారెడ్డి, సిద్దురాజు, కృష్ణ ప్రసాద్, గోదావరి, ఎస్ చంద్రకాంత్, సూపరింటెండెంట్ జె. వసంత లక్ష్మి, వరుణ్, హరికృష్ణ, భూషణం, విఠల్ , కనకరాజు, డి.రాజు, మహమూద్, సురేష్ రెడ్డి, కీర్తి స్వప్న, నరేష్ గౌడ్ లక్ష్మణ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ కోసం ప్రభుత్వం మంజూరు చేసే గ్రాంట్ల వినియోగ విధానంలో తీసుకొచ్చిన మార్పులు ప్రధానోపాధ్యాయులకు తలనొప్పిగా మారాయి. పాఠశాలల నిధులను పారదర్శకంగా ఖర్చు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నూతన చెల్లింపుల విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం సమస్యలొస్తున్నాయని ప్రధానోపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- అక్షరటుడే, ఎల్లారెడ్డి



చేయని ఖర్చులకు ముందస్తు బిల్లులా?

- ఉమ్మడి జిల్లా సర్కారు స్కూళ్లలో హెచ్‌ఎంలకు తంటాలు!
- గ్రాంట్ల చెల్లింపులో కొత్త నిబంధనలు
- పీఎఫ్‌ఎంఎస్ విధానానికి స్వస్తి..
- నేరుగా వెండర్ల ఖాతాల్లోకి నిధులు

కామారెడ్డి జిల్లాలో 1,020 స్కూల్ ఉన్నాయి. అందులో ప్రాథమిక పాఠశాలలో648, అప్పర్ ప్రైమరీ పాఠశాలలు 125, ఉన్నత పాఠశాలలు 191 ఉన్నాయి. అలాగే 56 రెసిడెన్షియల్ స్కూల్స్ ఉన్నాయి. నిజామాబాద్ జిల్లాలో 1,121 పాఠశాలలు ఉండగా అందులో 256 ఉన్నత పాఠశాలలు, 127 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, 738 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి.

ముందుగా బిల్లులు ఎలా సాధ్యం

ముఖ్యంగా ఇంకా కొనుగోలు చేయని వస్తువులకు, ప్రారంభించని పనులకు ముందుగానే బిల్లులు సమర్పించాలనే నిబంధనపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కొత్త విధానం ఎలా అమలు చేయాలో స్పష్టత లేకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అయోమయానికి గురవుతున్నారు. ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, పాఠశాల స్థాయిని ప్రాతిపదికగా తీసుకుని సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా ఏటా రూ.10 వేల నుంచి రూ.4 లక్షల వరకు వివిధ కేటగిరీల్లో గ్రాంట్లు మంజూరు చేస్తారు.

జాయింట్ ఖాతాల నుంచి..

గతంలో పాఠశాలలకు మంజూరైన గ్రాంట్లు హెచ్ఎం, పాఠశాల నిర్వహణ కమిటీ చైర్మన్ సంయుక్త బ్యాంకు ఖాతాలో జమయ్యేవి. అనంతరం ఖర్చులకు సంబంధించిన బిల్లులు, రికార్డులను సమర్పించే విధానం ఉండేది. ఆ తర్వాత నిధుల చెల్లింపుల కోసం పీఎఫ్‌ఎంఎస్ విధానాన్ని ప్రవేశ పెట్టారు. తాజాగా ఈ విధానంలోనూ మార్పులు చేస్తూ, వెండర్ల వివరాలను ముందుగానే నమోదు చేసి వారి బ్యాంకు ఖాతాల్లోకే నేరుగా నగదు జమ చేసే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకోసం వ్యాపారుల ఆధార్, పాన్ కార్డులు, బ్యాంకు ఖాతా వివరాలు తదితర సమాచారాన్ని సేకరించి పోర్టల్‌లో నమోదు చేయాల్సి వస్తోంది. ఈ ప్రక్రియ గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అదనపు భారంగా మారుతోంది.

పాఠశాల నిర్వహణకు ఈ నిధులు..

ఈ నిధులను పాఠశాలల రోజువారీ నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనకు వినియోగించాల్సి ఉంటుంది. సుద్దముక్కలు, స్టేషనరీ సామగ్రి కొనుగోలు, చిన్నపాటి మరమ్మతులు, విద్యుత్, ఇంటర్నెట్ బిల్లులు, తాగునీటి సరఫరా, లైబ్రరీ నిర్వహణ, జాతీయ పండుగల నిర్వహణ తదితర అవసరాలకు ఈ నిధులు ఉపయోగపడతాయి. నిధులను వినియోగించుకోవడంలోనూ రోజుకో నిబంధన ఎదురవుతుండటంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు.

ఆందోళనలో హెచ్ఎంలు

కొత్త విధానంలో హెచ్ఎం ఎక్కువగా ఆందోళనకు గురిచేస్తున్న అంశం ముందస్తు బిల్లుల సమర్పణ. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ వరకు పాఠశాలల్లో జరగబోయే వివిధ రకాల ఖర్చులకు ఇప్పుడే బిల్లులు సమర్పించాలని సూచిస్తున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. విద్యా సంవత్సరం ముగిసే వరకు అవసరాలు విడతలవారీగా ఏర్పడుతుంటాయి. ఏ సమయంలో ఏ వస్తువు అవసరమవుతుందో ముందుగానే నిర్ణయించడం సాధ్యం కాదని వారు పేర్కొంటున్నారు. ఇంకా కొనుగోలు చేయని వస్తువులకు వ్యాపారులు ముందస్తుగా బిల్లులు ఎలా ఇస్తారని, వాటి ఖర్చులకు సంబంధించిన రశీదులు ఎలా సమర్పించాలని ప్రధానోపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

వృద్ధాశ్రమంలో విద్యార్థుల ఆప్యాయ పలకరింపు!



అక్షరటుడే, ఎల్లారెడ్డి: పాఠ్యపుస్తకాల్లో చదివిన అంశాలను ప్రత్యక్ష అనుభవం ద్వారా తెలుసుకోవడంతో పాటు, విద్యార్థుల్లో మానవీయ విలువలు, పెద్దల పట్ల గౌరవభావం పెంపొందించాలనే ఉద్దేశంతో ఎల్లారెడ్డి ప్రభుత్వ బాలికల పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఏడో తరగతి తెలుగు పాఠ్యపుస్తకంలోని 'నాయనమ్మ' పాఠ్యాంశంలో భాగంగా విద్యార్థులను లింగంపేట మండలంలోని జీవదాన్ వృద్ధాశ్రమానికి తీసుకెళ్లారు. ప్రధానోపాధ్యాయుడు నర్సింలు ఆధ్వర్యంలో తెలుగు ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, నిర్మల, మాధురి నేతృత్వంలో ఈ విద్యా పర్యటన నిర్వహించారు. విద్యార్థులు వృద్ధులతో ఆప్యాయంగా ముచ్చటించి వారి జీవిత అనుభవాలు, కష్టసుఖాలను తెలుసుకున్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పాఠ్యాంశాలను ప్రత్యక్ష అనుభవాలతో అనుసంధానం చేస్తూ విద్యార్థుల్లో సేవాభావం, మానవత్వం, కుటుంబ విలువలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేసిన ఈ ప్రయత్నం ప్రత్యేకంగా నిలిచింది.

కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం..



అక్షరటుడే, నిజామాబాద్ సిటీ: కలెక్టరేట్ లో ఓ మహిళ ఆత్మహత్యాయత్నం చేసింది. తన ఇల్లును సొంతవారే కబ్జా చేయడంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. రూరల్ పోలీసులు, బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. హమాల్‌వాడీలో ఉండే విజయ అనే మహిళకు ఒక చెల్లెలు ఉంది. ఇటీవలే వారి తండ్రి మరణించాడు. అయితే ఆయన గతంలోనే అక్కాచెల్లెలికి ఇంట్లో చెరో గదిని రాసిచ్చారు. కాని తండ్రి మరణించిన అనంతరం చెల్లెలు అక్క విజయను గెంటేసి ఇల్లు కబ్జా చేసుకుంది. దీంతో దిక్కతోచని విజయ కలెక్టరేట్‌ను ఆశ్రయించింది. ప్రజావాణిలో ఫిర్యాదు చేసింది. కాని సమస్య పరిష్కారం అవుతుందో లేదోననే భయంతో విజయ మనమరాలు సరిత పురుగుల మంది తాగేందుకు యత్నించింది. గమనించిన పోలీసులు వెంటనే ఆమె దగ్గరి నుంచి పురుగుల మందు లాక్కున్నారు. విజయను, ఆమె మనమరాలు సరితను సముదాయించారు.



పశువులకు నట్టల నివారణ మందుల పంపిణీ

అక్షరటుడే, ఎల్లారెడ్డి: గ్రామంలోని ఆవులు, గేదెలు, లేగ దూడల పొట్టలో పెరిగే నట్టలు (పేగు పురుగులు) నివారణ కోసం తెలంగాణ ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు నట్టల నివారణ మందులను అందించి, పశువుల ఆరోగ్య పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. పశువుల పెరుగుదల, ఆరోగ్యం, పాల ఉత్పత్తి మెరుగుపడటంలో నట్టల నివారణ ఎంతో ముఖ్యమని వైద్య సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో వెల్లుట్లపేట గ్రామ సర్పంచ్ కొయ్యల వినోద్ రాజా గౌడ్, వెటర్నరీ డాక్టర్ అర్చన, పశువైద్య సిబ్బంది శ్రీనివాస్, సయ్యద్ మహబూబ్, రైతులు పటేల్ రవి, చిమ్మ రాములు తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పశువైద్య సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన కామారెడ్డి కాంగ్రెస్ నేతలు



అక్షరటుడే, కామారెడ్డి: ఢిల్లీ పర్యటనలో ఉన్న టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ను ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, కాంగ్రెస్ నాయకులు ఇప్ప శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ సభ విజయవంతమైన సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఐక్యత, సమష్టి కృషి పార్టీ బలోపేతానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కలిసికట్టుగా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దిశానిర్దేశంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమవుతోందన్నారు.

ఎల్లారెడ్డి పట్టణంలో అభివృద్ధి పనులకు భూమిపూజ



అక్షరటుడే, ఎల్లారెడ్డి: పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం భూమిపూజ చేశారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ ఇచ్చిన హామీ మేరకు ఎన్‌డీఎఫ్ నిధులతో పట్టణంలో రూ.10 లక్షల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఉస్మానియా మసీదు కమిటీ హాల్ నిర్మాణానికి రూ.5 లక్షలు, సయ్యద్ షా అబ్బాస్ షా వలీ నియాజ్ ఖానా నిర్మాణ పనులకు రూ.5 లక్షలు మంజూరు కావడంతో ఈ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మ శ్రీకాంత్, కౌన్సిలర్ సయ్యద్ గఫార్, కౌన్సిలర్లు చంద్రయ్య, దశరథ్, పీఏసీఎస్ చైర్మన్ నాగం గంగారం, మాజీ ఎంపీటీసీ సభ్యావత్ అలీ, కాంగ్రెస్ నాయకులు విద్యాసాగర్, రఫీక్, వసీం, శంకర్, మసీదు కమిటీ అధ్యక్షులు జలాల్, బాబర్, ముకర్రంతో పాటు కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి పీఏసీఎస్ నూతన భవన నిర్మాణానికి తీర్మానం



అక్షరటుడే, ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) పాలకవర్గ సమావేశం చైర్మన్ నాగం గంగారాం అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. పీఏసీఎస్ భవనం శిథిలావస్థకు చేరడంతో దాని స్థానంలో నూతన భవన నిర్మాణానికి కొత్త పాలకవర్గం తీర్మానం చేసింది. అలాగే అర్హులైన రైతులకు కర్షక మిత్ర ద్వారా రుణాలు అందించడంతో పాటు, అర్హత కలిగిన రైతులకు పంట రుణాలు (క్రాప్ లోన్లు) మంజూరు చేయించేందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా సంఘం సీఈవో సెప్టెంబర్ మాసానికి సంబంధించిన జమ, ఖర్చుల వివరాలను పాలకవర్గ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ నాగం గంగారాం మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ డైరెక్టర్లు, సీఈవో, సంఘం సిబ్బంది పాల్గొన్నారు.